క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భద్రాచలం: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పొదెం వీరయ్య మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 16 మంది లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు రూ.3,68,000 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, పార్టీ నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు నాగ సతీష్, బైరెడ్డి సీతారామారావు, సుబ్బారావు, సరెళ్ల వెంకటేష్, చింతరెల సుధీర్, ఎడారి ప్రదీప్, సిద్ది గణేష్, కొత్త శ్రీనివాస్, బలబద్రి మణికంఠ, తోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా క్యాంప్ కార్యాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకులు చింతిరేల సుధీర్ మాట్లాడుతూ.. భద్రాచలంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

గాయకుడికి సత్కారం

భద్రాచలంటౌన్: భద్రాద్రి గాయకుడు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభచాటి సినీ ప్రముఖుల చేతుల మీదుగా సత్కారం అందుకున్నాడు. హైదరాబాద్ త్యాగరాయ గానసభ, సిటీ కల్చరల్ సెంటర్‌లలో వంశీ ఇంటర్ నేషనల్ స్వర మాధురి, మల్లెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీలలో వేర్వేరుగా సంగీత నీరాజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భద్రాచలం పట్టణానికి చెందిన పోకల శ్రీనివాస్ అత్యుత్తమ ప్రతిభకనబరించాడు. దీంతో ఆయనకు మిస్టర్ పెళ్ళాం సినిమా నిర్మాత శ్రీశంఖు, ప్రముఖ సాహితీవేత్త వంశీచ దూరదర్శన్ సీనియర్ వ్యాఖ్యాత వోలేటి పార్వతీశం ఘనంగా శాలువతో సన్మానించి షీల్డ్ అందజేశారు.

భవన నిర్మాణాన్ని అడ్డుకోవడంపై ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని కె.వీరభద్రారం గ్రామంలో నూతన పాఠశాల భవన నిర్మాణాన్ని అడ్డుకున్న వారిపై పాఠశాల హెచ్‌యం అరుణకుమారి, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు తహసీల్దార్, ఎంపీడీఓ, యంఈఓలకు మంగళవారం ఫిర్యాదు చేశారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా నూతన పాఠశాల భవనం నిర్మాణం చేస్తున్న సమయంలో 1956లో పాఠశాలకు స్థలం దానం చేసిన గట్టుపల్లి ముత్తయ్య, బుచ్చిరాజుల మనవల్లు గట్టుపల్లి సాయికిరణ్, సాయికుమార్, చెల్లమ్మలు పనులను అడ్డుకున్నారు. దీంతో హెచ్‌యం, ఎస్‌ఎంసి కమీటి సభ్యులు మండల అధికారులకు ఫిర్యాదు చేశారు.

దరఖాస్తు చేసుకోండి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అర్హులైన రజిక కులస్తులు తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న కుల వృత్తుల దారుకలు చేయూత పథకానికి వెంటనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అఖిల భారతీయ దోబీ (రజక) మహా సంఘం భద్రాచలం పట్టణ అధ్యక్షుడు ముదిగొండ ముత్యాలరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకానికి 18 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయస్సున వారు అర్హులని, ఈనెల 20 లోపు అన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికే ఈ పథకం వర్తిస్తుందని ఆయన తెలిపారు.

ఓట్ల కోసమే ఆర్థికసాయం

బూర్గంపాడు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీసీ ఓట్లకు గాలమేసేందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కులవృత్తులవారికి ఆర్థికసాయమంటూ ప్రచార ఆర్భాటాలు చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ ఆరోపించారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో బీసీ ఓట్లను రాబట్టుకునేందుకు కేసీఆర్ మోసపూరిత హామీలు ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్ని బీసీ కులాలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

నగదు సాయమందించాలి

అశ్వాపురం: ప్రభుత్వం బీసీలకు అందజేస్తున్న లక్ష నగదు పథకం యాదవులకు కూడా వర్తింజేయాలని సామాజిక న్యాయవేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తూము సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంటలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గొర్రెల పథకంలో అధికారుల కాసుల కక్కుర్తి వల్ల నాసిరకం గొర్రెలు అందియాని, తద్వారా యాదవులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. మరణించిన గొర్రెలకు పరిహారం కూడా ఇవ్వలేదన్నారు.

ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు వన్నం కృష్ణమోహన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు అందజేశారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల సురేష్, నియోజకవర్గ కోఆర్డినేటర్ వలసాల వెంకటరామారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, ఎడవల్లి వెంకటయ్య, మేడ నాగేశ్వరరావు, బత్తుల శ్రీను, ఊట్కూరి సత్యనారాయణ, మామిడిపల్లి సీతారాములు, శ్రీనివాస్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- ప్రత్యేక పథకాల అమలులో ముందంజ
- అంగన్‌వాడీల ద్వారా ఆరోగ్యంపై దృష్టి
- మహిళ సంక్షేమ దినోత్సవంలో వక్తలు



భద్రాచలంఅర్బన్: మహిళా సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న అధికారులు, బ్యాంక్ మేనేజర్లు



మణుగూరురూరల్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విప్ రేగా కాంతారావు



అశ్వారావుపేటరూరల్: పోషకాహార స్టాల్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మంగళవారం హనుమాన్ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రేగా కాంతారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే రేగా కాంతారావు మహిళా సంక్షేమశాఖ అధికారులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేదిక వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు సీఎం కేసీఆర్ మేనమామలా కల్యాణలక్ష్మి పథకం కింద లక్షా 116 రూపాయలను, మహిళలు, గర్భిణుల ఆరోగ్య రక్షణ కోసం న్యూట్రిషన్ కిట్లు, బాలింతలకు కేసీఆర్ కిట్లు, ఒంటరి మహిళలకు, వితంతువులను పెన్షన్లు వంటివి అందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి, మహిళా సంక్షేమ శాఖ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందని డిప్యూటీ సీఈఓ బి.నాగలక్ష్మి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గిరిజన అభ్యుదయ భవనంలో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ద్వారా మహిళా సంఘాలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇస్తూ ఆర్థికంగా చేయూతనిస్తోందని చెప్పారు. ఈ క్రమంలో భద్రాచలం శాఖ నుంచి 550 మంది మహిళా సంఘాలు సభ్యులు పాల్గొనగా 2014 నుంచి 2023 వరకు ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ రాయితీగా 2,633 ఎస్‌హెచ్‌జీలకు గాను రూ.649.50 లక్షలు జమ చేసినట్లు, 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ బ్యాంక్‌ల ద్వారా రూ.2.50 కోట్లు బ్యాంక్ లింకేజ్ రుణాలను సంఘం సభ్యులకు అందజేసినట్లు డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రత్న కల్యాణి, జిల్లా సంక్షేమ అధికారి సబితా, డీపీఓ రామకృష్ణ, సీడీపీఓలు దుమ్ముగూడెం భద్రాచలం, నవ్య శ్రీ, చైతన్య ,జగదీష్,గ్రామ పంచాయతీ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, ఆయాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మహిళా, శిశు సంక్షేమానికి సీఎం కేసీఆర్ గతంలో లేని విధంగా విప్లవాత్మక పథకాలను అమలు చేస్తున్నారని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకు అంగన్‌వాడీ టీచర్లు కోలాటం ఆడుతూ ఘన స్వాగతం పలికారు. అలాగే పోషకాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య లక్ష్మి, బాలామృతం ప్లస్, ఫోర్టిఫైడ్ బియ్యం, ఈ నెల నుంచి ఫోర్టిఫైడ్ సన్న బియ్యం, గిరిజన ప్రాంతాల్లో గిరి పోషణ, ప్రీ స్కూల్ విద్య, న్యూట్రీ గార్డెన్‌లతోపాటు అనేక పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వివరించారు. మైనర్లు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు, సిబ్బందికి ఎమ్మెల్యే సన్మానించి, జ్ఞాపికలను అందించారు. డీఆర్‌డీఓ మధుసూధన్‌రాజు, సీడీపీఓ రోజారాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ములకలపల్లి: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో ఎంపీటీసీ సభ్యురాలు శనగపాటి మెహరమణిని దుశ్శాలువతో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపలరును విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ సునీత, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ గొడ్ల రాజు, రైతు సమన్వయ సమితి సభ్యులు సీతారాములు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేష్

భద్రాచలంఅర్బన్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని మెజిస్ట్రేట్ ఎం.వెంకటేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం భద్రాచలం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. బాలలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు ఏపీపీ సాంబాదుర్గాబాయ్, న్యాయవాదులు పి.శ్రీనివాసాచారి, బి.రమేష్, అరుణశ్రీ, రాంబాబు, విద్యాధరి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: గోదావరి, పోలవరం బ్యాక్ వాటర్ నుంచి భద్రాచలం రక్షణకు సత్వర చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చాంబర్ ఆఫ్ కామర్స్ భవన్‌లో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పాల్గొన్న పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, సామాజిక సంఘాల బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. గోదావరి ముంపు నుంచి భద్రాచలం పట్టణ రక్షణకు పార్టీలకు అతీతంగా ఉద్యమించాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసి సమస్య పరిష్కారానికి కేంద్రం చొరవ చూపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భద్రాచలం వస్తున్నందున భద్రాచలం సమస్యల పట్ల సానుకూలమైన ప్రకటన చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్‌కె అజీమ్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఏ.సునీల్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కేచ్చల రంగారెడ్డి, టీఎన్జీఓ నాయకులు నాగేశ్వరరావు, ఎంఎస్పీ పార్టీ జిల్లా నాయకులు అలవాల రాజా, బీఎస్పీ పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.సుధాకర్, గిరిజన సంఘం నాయకులు పూనమ్ కృష్ణ, సామాజిక సంఘం, స్వచ్ఛంద సంస్థల నాయకులు తిరుమలరావు, మాధవరెడ్డి, రవి కుమారి, దాసరి శేఖర్, అల్లాడి పాల్ రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కే.బ్రహ్మాచారి, ఎంబీ.నర్సారెడ్డి, సీఐటీయూ పట్టణ నాయకులు ఎం.రేణుక, నాగరాజు, లక్ష్మణ్, ఐద్వా పట్టణ కార్యదర్శి లక్ష్మి, లీలావతి, గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్, బి.ధర్మ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు భూపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బహుజనులకు తీవ్ర అన్యాయం



దుమ్ముగూడెం: సమావేశంలో పాల్గొన్న నాయకులు

చర్ల: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో బహుజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ అన్నారు.

చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెంలో పార్టీ మండల అధ్యక్షుడు కూరపాటి వీర్రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళ సమతపై అత్యాచారం చేసి, హత్య చేసిన వారికి సరైన శిక్ష ఎందుకు పడలేదని ఆయన ప్రశ్నించారు. డాక్టర్ ప్రీతి చైత్రబాయి వంటి గిరిజన బిడ్డల చావుకు కారకులెవరని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించడాన్ని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.దామోదర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.కృష్ణ, జిల్లా కార్యదర్శి ఈ.శేషావతారం, మండల అధ్యక్షుడు కూరపాటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్రంలో డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలోని బీఎస్పీనే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం శ్రీనగర్ కాలనీలో జరిగిన బహుజన సమాజ్ పార్టీ మండల కమిటీ సమీక్ష సమావేశం మండల అధ్యక్షుడు కంచర్ల సింహాద్రి అధ్యక్షతన జరగగా.. రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిద దామోదర్ రావు, ఆర్గనైజరింగ్ సెక్రటరీ కేసుపాక కృష్ణ, కార్యదర్శి ఇల్లందుల శేషవతారం, మండల ఉపాధ్యక్షుడు సొంది వెంకట్రాజు, ప్రధాన కార్యదర్శి కొప్పల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన సాహిత్య దినోత్సవంలో పాల్గొన్న అశ్వారావుపేటకు చెందిన కవి డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఆయన చదివిన కవిత రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లుగా అధికారులు మంగళవారం సమాచారం ఇచ్చారు.

అక్రమ డిప్యూటేషన్లను సహించం

మణుగూరురూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో వివిధ మండలాలకు డిప్యూటేషన్‌పై సర్దుబాటు చేసేందుకు రంగం సిద్ధమౌతోందని, అదే జరిగితే ఊరుకునేది లేదని టీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్‌నాయక్, రమేష్‌బాబులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది లాగా ఇప్పుడు కూడా ఉపాధ్యాయులను అక్రమ మార్గంలో వివిధ పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపిస్తే సహించేది లేదన్నారు. ప్రత్యేకంగా జిల్లా విద్యాశాఖాధికారిని కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సెక్షన్ల విధానాన్ని రద్దు చేయాలి

దమ్మపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఆశ్రమ పాఠశాలల్లో సెక్షన్ల విధానం రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో సెక్షన్ల ఏర్పాటు చేసి ఒక్కో సెక్షన్‌కు 45 నుంచి 50 మంది విద్యార్థులు దాటితే.. అదే తరగతిలో అడ్మిషన్ కోరిన గిరిజన విద్యార్థులను వేరే ఆశ్రమ పాఠశాలలకు తరలించడం విద్యాహక్కు చట్ట నిబంధనలను అతిక్రమించడమేనని పేర్కొన్నారు.

విజేతగా నెమలిపేట జట్టు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీల్లో నెమలిపేట జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సహకారంతో రూ.10వేల రూపాయల నగదు బహుమతిను జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్ వరలక్ష్మి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంగాల పరమేష్, సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ను నియమించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను నియమించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం తహసీల్దార్ నెల రోజులపాటు ములుగు, పరకాల, హనుమకొండ నియోజకవర్గాలకు ఎన్నికల విధులకు వెళ్లడంతో ఆయన ప్రజలకు అందుబాటులో లేరని, ఈ క్రమంలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఏరియాలో సింగరేణి డైరెక్టర్ల పర్యటన



జియో థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్లు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్‌వీకే శ్రీనివాస్, సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జి.వెంకటేశ్వరరెడ్డిలు మంగళవారం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో కలిసి పర్యటించారు. పర్యటనలో భాగంగా కొండాపురం భూగర్భగనిని సందర్శించి గనిలోపలికి వెళ్లి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పగిడేరు గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న 20కిలోవాట్ సామర్థ్యం ఉన్న జియో థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్యసాధనపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్వోటు డైరెక్టర్ ఎస్.సుధాకర్‌రావు, ఏరియా ఎస్వోటు జీఎం లలిత్‌కుమార్, ఏజీఎం కేపీయాజీ నాగేశ్వరరావు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, శ్రీరామ్ ఇన్స్టిట్యూట్ ఫోర్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ భూపేష్ శర్మ, ఈఈ(ఈఅండ్‌ఎం) ఎనుగుల విజయ్‌పాల్, కేపీయాజీ రక్షణాధికారి మధుబాబు, సీనియర్ సెక్యూరిటీ అధికారి అబ్దుల్ షబ్బీరుద్దీన్, జూనియర్ సర్వే అధికారి సర్వర్ నభి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్ రెడ్డి

భద్రాచలంటౌన్: తెలంగాణ బిడ్డలు కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో నేడు కుటుంబ, అరాచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆరోపించారు. భద్రాచలం పట్టణంలోని హరిత టూరిజం హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూరైన సందర్భంగా ఈ నెల 30 నుంచి జూన్ 31 వరకు మహాజన్ సంపర్క్ అభియాన్ పేరుతో కార్యక్రమం నిర్వహించనుందని తెలిపారు. ఇందులో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఇంటింటికీ బీజేపీ.. గడప గడపకూ కమలం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకు పోవాలనే సంకల్పంతో ఈనెల 15 ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు బీజేపీ అభిమానులు, కార్యకర్తలు ఈ బహిరంగ సభకు భారీగ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, రామ్మోహన్‌రావు, వెంకన్న, సతీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనను జయప్రదం చేయండి

మణుగూరురూరల్: ఈ నెల 15వ తేదీన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు గరికపాటి రామ్మోహన్‌రావు, ఏనుగుల రాకేష్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మణుగూరులోని స్నేహగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు చిర్ర సరస్వతి, నాయకులు పున్నం బిక్షపతి, లింగంపల్లి రమేష్, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, సీతారాంనాయక్, నాగమణి, రమేష్, దివ్యశ్రీ, రామకృష్ణ పాల్గొన్నారు.

ములకలపల్లి: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్యఅతిథిగా పాల్గొననున్న బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా ప్రసాద్ పిలుపునిచ్చారు. నల్లివారిగూడెంలో కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు స్వగృహంలో మంగళవారం జరిగిన పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గ పాలక్ అద్దె బాబయ్య ముదిరాజ్, జాతీయ కిసాన్ మోర్చా ఎగ్జిక్యూటివ్ పాపయ్యగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు అనుమల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శనగపాటి సీతారాములు, నియోజకవర్గ కన్వీనర్ గొల్లిపుల్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గుండాల: మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సమావేశాలకు రాకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలా అయితే మండలంలో సమస్యలను ఎవరు పరిష్కరిస్తారని వైస్‌ఎంపీపీ రేసు ఎల్లయ్య మండిపడ్డారు. మంగళవారం ఆళ్లపల్లి మండల పరిషత్‌లో సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి 21 శాఖలకు గానూ, 12 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకవాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలో ఇన్‌చార్జ్‌ల పాలన తీసివేసి రెగ్యులర్ అధికారులను నియమించాలన్నారు. మండలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల ఇబ్బందులు పడుతుంటే వైద్యులను డిప్యుటేషన్‌పై బదిలీ చేయడం సరైంది కాదని, తక్షణమే వైద్యులను నియమించాలని ఎంపీపీ మంజు భార్గవి, వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్యలు డిమాండ్ చేశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులకు, బ్రిడ్జీలకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ సీజన్ ఆసన్నమైందని ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందించాలని తెలిపారు. మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ సాదియా సుల్తానా, ఎంపీడీఓ నారాయణ, ఎంఈఓ కృష్ణయ్య, ఏఓ అశోక్, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండాలలో ప్రత్యేక సమావేశం

ఈ నెల 22న మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరుల సంస్మరణను పురస్కరించుకుని ఈ సమావేశం ఏర్పాటు చేయడం నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారులందరూ హాజరుకావాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నూతన కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బాలసాని లక్ష్మీనారాయణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ పార్టీ భద్రాచలం ఇన్‌చార్జ్ బాలసాని లక్ష్మీనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికీ చేరేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానే రామకృష్ణ, తిరుపతిరావు, కృష్ణమూర్తి, చిట్టిబాబు, రాము, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



మణుగూరురూరల్: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మణుగూరురూరల్: ఆర్టీసీ కార్మికులకు పెండింగ్ పేస్కేల్ అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం మణుగూరు డిపోలో ఆర్టీసీ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు మాట్లాడుతూ.. 2017, 2021 పెండింగ్ పేస్కేల్ అమలు చేయాలని, 2021 గైడ్‌లైన్స్ సవరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పని భారం తగ్గించాలని కోరారు. సీసీఎస్, పీఎఫ్ సంస్థలకు బకాయిలను చెల్లించి నెలవారీ రికవరీలను సీసీఎస్‌కు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్(సీఐటీయూ) ఖమ్మం రీజియన్ అధ్యక్షుడు బాణాల రాంబాబు, డిపో నాయకులు పి.వెంకటేశ్వర్లు, తాటి సుధాకర్, ఎస్.సలీమ్, ఎం.రవి, టి.నరేందర్, కంది వెంకన్న, జిల్లా రమేష్, అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం నిరసన బాడ్జీలతో విధులకు హాజరన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు పేస్కేల్ అమలు చేయాలని, కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఆపాలని, పని భారం తగ్గించాలనే తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. నిరసన తెలుపుతూ బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు.